## మాకు శివ, కాలేజ్ కి "CI" మురళి! - by పార్థు



ఈ పేజీని పంపండి

అప్పుడు మనం ఒంగోలు లో B.Sc వెలగబెడుతున్నాం. మనం అంటే నేను, మా మిత్రబృందం. నేను, మా బావగాడు (శివ), మా బాబాయి గాడు (కృష్ణమోహన్), పంతులు, శ్రీరామ్ బాగా దోస్తులం. మా బృందానికి అందరి కాలేజ్ బాచ్ ల లానే ఓ కొన్ని "స్టాండర్డ్" బుద్ధులు వుండేవి. ఒకటే టీ ని ఇద్దరు లాగించడం, మన్మధుడు సినిమా లో త్రివిక్రమ్ చెప్పినట్టు "లూనా" ఒకడు తెస్తే పెట్రోల్ ఇంకోడు పోయించడం, సెంట్రల్ కేఫ్ లో 2 ఇడ్లీ, 4 కప్పుల సాంబార్ సేవించడం వగైరా (సేవింగ్స్ కోసం).

వీటి తో పాటు, రికార్డ్స్ ఆఖరి నిమిషం వరకూ పూర్తి చెయ్యకపోవడం, రేపో, ఎల్లుండో ప్రాక్టికల్స్ వున్నాయి అనగా, డిపార్ట్ మెంట్ హెడ్ సంతకాలకి "చిరంజీవి కాల్ షీట్స్ కోసం విజయబాపినీడు తిరిగుతున్నట్టు" తిరగడం, ఎక్కడున్నాడా మహానుభావుడు అని!

అప్పట్లో ఒంగోలు కి మురళి అని ఒక CI వచ్చారు. మనోడు "అంకుశం లో రాజశేఖర్ టైపు" అని ఒకటి రెండు సీన్లకే జనాల కి అర్ధం అయింది. పైగా కొన్ని "గలాటా" సందర్భాల లో extra వేషాలేసిన కాలేజ్ స్టూడెంట్స్ ని బట్టలు వూడదీయించి (మగ పిల్లలవే లెండి), క్రాఫింగులూ గట్రా చేయించి, రోడ్ల మీద నడిపించాడు. దానితో CI మురళి అంటే "చంద్రముఖి లో జ్యోతిక" ని చూసినట్టు చూసేవాళ్ళు కుర్రకారంతా.

అప్పటి వరకూ ఎవడు విననటువంటి Anti-Gunda Squad (AGS) అని, "చిరంజీవి టాగూర్ లో ACF" లాంటిది ఒక దానిని సృష్టించి, భయపెట్టాడు కుర్రోళ్ళని. సెకండ్ షో సినిమా నుంచి వస్తున్నారు అంటే తప్పకుండా జేబుల్లో టికెట్ ముక్కలు పెట్టుకునే వాళ్ళం, లేదా పక్కటెముకలు విరిగి పోయేవి తేడాలొస్తే, అర్ధరాత్రి ట్రైన్ దిగి వస్తున్నాం అంటే సవాలక్ష ప్రశ్నలు వేసే వాళ్ళు!

అలా కుర్రకారు అంతా భయపడి ఛస్తూ దీనంగా, హీనం గా బతుకుతున్న రోజులు అవి! అమ్మాయిలు మాత్రం "చెప్పిన డేట్ కన్నా ఒకరోజు ముందే సినిమా రిలీజ్ చేసిన ప్రొడ్యూసర్ లా" గర్వం గా తలెత్తుకుని తిరిగుతుండేవాళ్ళు.

అలవాటు లో భాగం గా ఆ ఏడాది కూడా, మా బావ గాడు రేపు ప్రాక్టికల్స్ అనగా ఇవాళ మెస్ వాడికీ, టీ షాప్ "మస్తాన్" కీ ఇవ్వవలసిన బాకీలు అన్నీ పోగా మిగిలిన డబ్బులతో రికార్డ్ బుక్స్, స్కెచ్ పెన్నులూ, ఇంక్ డబ్బాలూ కొని రెడీ అయిపోయాడు HOD సంతకాలకి. నాతో సహా, మా మిగిలిన గాడిదలన్నీ అంతకు ముందే ఆ కార్యక్రమాన్ని "పొరపాటున" పూర్తి చేసి రావడం తో, వీడు ఒక్కడే వెళ్ళక తప్పింది కాదు.

వాడు బయలుదేరే సమయానికి మేమంతా అంతకు ముందు రోజు "రవిశాస్త్రి" పునాది గట్టి గా వుండటం కోసం, క్రీజ్ వద్దే పాతుకుపోయి, ఆచి, తూచి ఆడుతూ చేసిన సెంచురీ కారణం గా ఇండియా వోడిపోయిన క్రికెట్ మాచ్ తాలూకు విశ్లేషణ సాగిస్తున్నాం. వాడు "రేయ్ ఒక గంట లో వచ్చేస్తాను, అప్పుడు వెల్దాం అందరం లంచ్ కి" అన్నాడు. "సర్లే, రా" అని చెప్పి మేము మా పన్లో పడ్డాం.

అపి ఇంటర్ పరీక్షలు జురుగుతున్న రోజులు కూడా. మధ్యాహ్నం పన్నెండు అయింది. కాండిడేట్ రాలా! సర్లే, HOD కదా, దొరికుండడు సంతకాలకి అనుకున్నాం. రెండు అయింది, పత్తా లేడు. సెల్ ఫోన్ల ఎరా కాదాయే కనుక్కుందాం అంటే! పోనీ కాలేజ్ కి పెడతామా అంటే దూరం, పైగా పరీక్షలు జురుగుతున్నాయి. ఒక పక్క పంతులు గాడి "ఉదర" పిదారక గోల! (అదేనండీ ఆకలి), పాపం కాసేపు ఆలస్యం అయినా కూడా ఓర్చుకోలేడు బిడ్డ! "సర్లే ఒక బాచ్ వెళ్ళిపోండి మెస్ కి, నేనూ, బాబాయి గాడూ వుంటాం శివ గాడి కోసం" అని చెప్పి వాళ్ళని పంపేసాం.

మధ్యాహ్నం మూడూ అయ్యింది.. అయినా రాలా.

ఈ లోపు తలుపు చప్పుడయింది. "హమ్మయ్యా! వచ్చాడు ఇప్పటికి!" అనుకున్నాం. తీసి చూస్తే, "సనత్" అని ఇంకో క్లాస్ మేట్ గాడు. వచ్చి చాప మీద కూర్చుని, ఆయాసం తో "రేయ్! శివ గాడ్ని జైల్లో పెట్టారు" అన్నాడు. "నేనూ మా మామయ్య తో పనుండి వన్-టవున్ పోలీస్ స్టేషన్ కి వెళ్ళా. వాడు అక్కడ సెల్ లో వున్నాడు. ఇంకా చాలా మంది వున్నారు వాడితో. ఏమైంది?" అని ఓ ప్రశ్న వేసాడు.

మాకు షాకు! "శివ" సినిమా పదకొండు సార్లు చూసిన ప్రభావమో, ఏమో, అంతే, ఆవేశం గా లేచాం "పదండ్రా" అంటూ.

ఈ లోపు "అంకుశం" లో రాజశేఖర్, CI మురళీ ఒకేసారి కనిపించారు కళ్ళ ముందు రౌద్రావతారం లో. ఆవేశం కాస్తా చల్లపడిపోయింది "ప్రత్యేక తెలంగాణా" ఉద్యమం లా.

పిల్ల గాళ్ళం, పలుకుబడి లేనోళ్ళం, ఏం చేస్తాం అక్కడికి వెళ్ళి అని, ముందు మస్తాన్ టీ షాపుకెళ్ళి ఆలోచిస్తూ కూర్చున్నాం (మేము సహజం గా, ఏ సినిమా కి వెళ్ళాలి, ఇవాళ ఫిజిక్స్ ట్యూషన్ కి వెళ్ళాలా, వద్దా లాంటి పవిత్రమైన నిర్ణయాలు తీసుకునేప్పుడు, మస్తాన్ టీ సెంటర్ లో కూర్చుని తీసుకునేవాళ్ళం) . ఈ లోపు మెస్ లో తెగ మెక్కి తిన్న సోమాలియా ఆకలి శరణార్థుల బాచ్ కూడా వచ్చారు. ఎవడి కి చెప్పాలా?, ఎవడ్ని పోలీస్ స్టేషన్ కి తీసుకుని వెళ్ళాలా? అన్న దాని మీద ఓ గంట, గంటన్నర డిస్కషన్ జరిగిన తరువాత, శివ గాడి కి క్లోజ్ అయిన "మేథ్స్" లెక్చరర్ కి చెప్పటం మంచిది అని బయలుదేరాం.

ఈ లోపు సందు చివర లో "Hero Jet" సైకిల్ మీద వస్తూ కనిపించాడు మన హీరో!

ఓ సింగిల్ టీ తాగి (అలసిపోయాడు కదా అని ఫుల్ టీ వాడికే), స్టోరీ విప్పాడు. చెప్పాను కదా, కాలేజ్ లో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి అని. CI మురళి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారుట కాపీలు జరగకూడదు అని. అందువల్ల కాలేజ్ చుట్టూ ఓ రెండు పెట్రోలింగ్ వాన్లూ, అక్కడక్కడ మఫ్టీ లో AGS వాళ్ళూ వున్నారట. కాలేజ్ లో పనివున్న వాళ్ళ కోసం ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసారట, నోటీస్ కూడా పెట్టారుట మెయిన్ ఎంట్రన్స్ దగ్గర. "మరి చూడలేదా!?" అంటే, "మనమెప్పుడూ వెళ్ళేది వెనుక నుంచే కదరా, అందుకని కనపడ్లా" అన్నాడు (నిజమే, షార్ట్ కట్ అని మేము వెనుక ఫెన్సింగ్ తీసేసిన చోట నుండి వచ్చేస్తాం సహజంగా).

అలా వెడుతుంటే, ఈ లోపు అక్కడ కొంత మంది కాపీలు అవీ విసరడం, కిటికీ దగ్గరికి వెళ్ళి

ఆన్సర్ పేపర్లు తీసుకుని రాసి పైకి పంపడం లాంటివి చేస్తున్నారని తెలియడం తో AGS వాళ్ళు వచ్చేసి క్షణం లో అందర్నీ వాన్ ఎక్కించేసారట. "ఏరా మరి చెప్పలేదా నువ్వు సంతకాల కి వచ్చావు అని, రికార్డ్స్ చూపించకపోయావా?" అంటే, "అదీ అయ్యింది.. ఇదో అయిడియానా లోపలకి వెళ్ళి, కాపీలు అందించడానికి?" అని తోసేసారుట వినిపించుకోకుండా!

"సాయంత్రం వరకూ వుంచి, భయపెట్టి వదిలేసారు!" అన్నాడు నిట్టూరుస్తూ. మా చేత శివ అనీ, బావా అనీ పిలవబడే వాడు, ఆ రోజు నుండీ, మా క్లాస్ మొత్తానికి మాత్రం "CI మురళి" అయి కూర్చున్నాడు. "ఏరా CI మురళీ" అనే వాళ్ళు.

ఇప్పటికీ మా బాచ్-మేట్స్ ఎక్కడైనా కలిస్తే, వీడి గురించి అడిగేప్పుడు "CI మురళి ఇప్పుడు ఏ స్టేషన్ లో (ఏ వూర్లో) వున్నాడు?" అని అడుగుతారు. ఇప్పుడు వాడు విజయవాడ లో పేరుమోసిన రెసిడెన్షియల్ కాలేజ్ లో మేథమేటిక్స్ విభాగం లో సీనియర్ లెక్చరర్.

మరి కొన్ని ఒంగోలు కబుర్లు, మరెప్పుడైనా..

* * * End * * *

---

మీ సూచనలూ, సలహాలు రచయిత పార్థు కి తెలియచేయండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి